# మేధావి

ఎం. యస్. మూర్తి

"—శేషయ్యా?"

"ప్రభూ! ఇక్కడే వున్నా—"

"నిన్న మన పట్టాభిషేక సమయంలో నన్ను ప్రజలకు పరిచయం చేస్తూ ఏదో అన్నావోయ్—?"

"ఏమన్నాను ప్రభూ?"

"జ్ఞాపకం చాలదోయ్—"

"ఏ సందర్భంలోనో కొంచెం తమరు తెలిపితే...."

"నా సుగుణాలను ఏకరుపెడుతూ నేనేదో పెద్ద వాణ్ణన్నావు—"

"ఓహోహో! అదాండీ? తమరు, గొప్ప మేధావులన్నా—"

"మేధావినా—అంటే?"

"గొప్ప మేధగలవారని—"

"మేధంటే—"

"మెదడండి—జ్ఞానేంద్రియం—"

"ఎక్కడుంటుందా పదార్థం?"

"తమ తలకాయలోనండి—బత్తాయి కాయంత వుంటుంది—"

"అది నా వొక్కడికే వుంటుందా?"

"లేదండి—అందరికీ వుంటుంది."

"అయితే నా గొప్పేమిటీ?"

"మీ గొప్ప మీ మేధే! అందరికీ ఉసిరికాయంత ఉంటే, మీది—"

"సైజు పెద్దదంటావా నాది?"

"సైజే కాదండి — అంతస్తు కూడాను—"

"అంటే?"

"తమ తలకాయలో వున్న ఈ మేధా యంత్రం సామాన్యులందరికీ వుండే టటువంటిది కాదు — ప్రభువులకిమట్టుకే అటువంటిది—అంత పెద్దది వుంటుంది—"

"బాగా విశాలంగా చెబుతావా?"

"చిత్తం! తమ రాజ్యంలో ఎవరికీ కూడా తమకు వుండేటంత గొప్ప—మేధ లేదు—"

"అలాగనా! అయితే ఇది యెందుకు పనికి వస్తుందంటావు?"

"బుద్ధి వికాసాదులను ఇచ్చేది అదే నండి—తమ చేతులు కత్తిపట్టుకుని యుద్ధం చేస్తాయి, కాళ్లు నడుస్తాయి, కళ్లు చూస్తాయి—ఇలాగే ఏ అవయవం అది చేయవలసిన పనిని చేస్తుంది—వీటన్నిటి చేతా ఆ పనులను చేయించేది మెదడు—ఇది చిన్నదైతే—చిన్నచిన్న పనులనే




చేయిస్తుంది—పెద్దదైతే—తమకు వుండే లాంటిదైతే బ్రహ్మాండమైన పనులను చేయిస్తుంది—''

''ఎలాగ కాస్త విడమరిచి చెప్పూ—?''

''నా మెదడు చిన్నది—గనక, నేను మంత్రిగానే వున్నాను. తమరిది పెద్దది—మీరు ప్రభువులై పాలిస్తున్నారు—''

''అర్థమైంది—''

''ధన్యోజ్మి ''

''అయితే, ఇది నాకు చాలా విలువైందన్నమాట?''

''మీ రాజరికం దానిమీదే ఆధారపడి వుంది—''

''అంటే, అది నాకూ, నా రాజరికానికీ చాలా ముఖ్యమయిందన్నమాట?''

''చిత్తం!''

''అయితే నేను, దాన్నిగురించి చాలా జాగ్రత్త తీసుకోవాలి కదూ?''

''దేన్ని గురించండీ?''

''ఈ మెదడును గురించి—?''

''అవునండి! దాన్ని ఏ మాత్రం అలసట చెందనీకండా, జాగ్రత్తగా కాపాడుకోవాలి—''

''మన ఖజానాలో డబ్బుకు మల్లే కదూ?''

''ఒకవిధంగా చూస్తే—అంతేనండి!''

''అయితే దాన్నితీసి పదిలంగా ఖజానాలో దాచమని చెప్పు!''

